
సాక్షి
కాకినాడ
శనివారం । 13 । ఏప్రిల్ । 2024



ఓటరు జాబితాలో మీ పేరుందా?
ఎన్నికల జాబితాలో ఓటు లేకపోతే ఫారం–6 ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 25వ తేదీ వరకూ ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. - 8లో▸



డెల్టాలకు నీటి విడుదల
ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం తూర్పు డెల్టాకు 2 వేలు, మధ్య డెల్టాకు 1,550, పశ్చిమ డెల్టాకు 3,600 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
39.2°/26.5°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	39.0	24.0
కాకినాడ	35.1	26.5
అమలాపురం	39.2	26.0

న్యూస్‌రీల్

వేణుకు 974 మార్కులు


కేతా వేణు

కాజులూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎంపీసీ విద్యార్థిని కేతా వేణు ఇంటర్ ఫలితాల్లో వెయ్యికి 974 మార్కులు సాధించిందని ప్రిన్సిపాల్ ఎస్ఎస్ఎస్ శ్రీనివాస్ తెలిపారు. ఆమెను కళాశాల సిబ్బంది, సహచర విద్యార్థులు అభినందించారు.

అంబేడ్కర్ జయంతికి ఏర్పాట్లు

కాకినాడ సిటీ: ఈ నెల 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి నిర్వహించనున్నట్టు కలెక్టర్ జె.నివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ సమీపంలోని ఇంద్రపాలెం కూడలి వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఆ మహనీయుని జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ యువజన కమిటీలో సుధీర్ నియామకం


చవ్వాకుల సుధీర్ కుమార్

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కమిటీ సంయుక్త కార్యదర్శిగా గంగనాపల్లికి చెందిన చవ్వాకుల సుధీర్ కుమార్ నియమితులయ్యారు., పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సుధీర్ కుమార్‌ను ఆ పదవిలో నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సుధీర్ నియామకంపై వైఎస్సార్ సీపీ గంగనాపల్లి నాయకుడు, జేసీఎస్ మండల కన్వీనర్ గీసాల శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు.

241 మంది వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా


రంపయర్రంపాలెంలో కార్యదర్శికి రాజీనామాలు సమర్పిస్తున్న వలంటీర్లు

గోకవరం: జగ్గంపేట నియోజకవర్గంలో వలంటీర్లు మూకుమ్మడి రాజీనామాలు చేశారు. ఉగాది పండగ రోజున టీడీపీ అధినేత చంద్రబాబు వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని, వలంటీర్లకు రూ.10 వేలు అందిస్తామని చెప్పిన తరువాత ఈ స్థాయిలో మూకుమ్మడి రాజీనామాలు చేయడం గమనార్హం. గోకవరం మండలం గంగంపాలెంలో 8, ఇటికాయలపల్లి 7, మల్లవరం 23, రంపయర్రంపాలెం 20, తంటికొండ 11, వెదురుపాక 12, గుమ్మళ్లదొడ్డిలో ఒకరు చొప్పున మొత్తం 82 మంది వలంటీర్లు రాజీనామాలు చేశారు. ఈ నెల 10న గోకవరానికి చెందిన నలుగురు వలంటీర్లు సైతం రాజీనామాలు సమర్పించారు. కిర్లంపూడి మండలంలో 49 మంది, జగ్గంపేట మండలంలో 110 మంది వలంటీర్లు రాజీనామాలు చేశారు. మూడు రోజుల క్రితం మర్రిపాకకు చెందిన 15 మంది కూడా రాజీనామా చేశారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించేందుకు తమ వంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా పలువురు అన్నారు.

అమ్మాయిలదే హవా

- ఇంటర్ ఫలితాల విడుదల
- ఫస్టియర్ 60 శాతం.. సెకండియర్ 71 శాతం ఉత్తీర్ణత

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఇంటర్మీడియెట్ పరీక్షల ఫలితాల్లో జిల్లావ్యాప్తంగా అమ్మాయిలు తమ సత్తా చాటుకున్నారు. గత నెల ఒకటి నుంచి 20వ తేదీ వరకూ ఇంటర్ పరీక్షలు నిర్వహించిన విషయం విదితమే. పరీక్షలు పూర్తయిన 22 రోజుల్లోనే ఫస్టియర్, సెకండియర్, జనరల్, ఒకేషనల్ ఫలితాలను శుక్రవారం ఒకేసారి విడుదల చేయడం విశేషం. గత ఏడాది వరకూ ఉమ్మడి జిల్లాల వారీగా ఫలితాలు విడుదల చేసేవారు. ఈ ఏడాది నుంచి కొత్త జిల్లాల ప్రాతిపదికన ఫలితాలు విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా 146 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల నుంచి ప్రథమ సంవత్సరం పరీక్షలకు 19,656 మంది హాజరయ్యారు. వీరిలో 11,783 మంది (60 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 15,969 మంది హాజరు కాగా, 11,337 మంది (71 శాతం) ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్ర స్థాయిలో మన జిల్లా ద్వితీయ సంవత్సరం 18, ప్రథమ సంవత్సరం 15 స్థానాల్లో నిలిచింది. జిల్లా వ్యాప్తంగా 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా ప్లస్ టూ హైస్కూల్ ప్లస్ 14, మోడల్ స్కూల్స్ 2, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ 4, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ 8, ప్రైవేట్ ఎయిడెడ్ 4, అన్ ఎయిడెడ్ 99 కళాశాలలు ఉన్నాయి. ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ప్రతిభ చూపారు. ప్రభుత్వ కళాశాలల నుంచి ఫస్టియర్ జనరల్ విభాగంలో 2007 మంది పరీక్షలు రాయగా, 703 మంది ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ విభాగంలో 942 మందికి 538 మంది పాసయ్యారు. ద్వితీయ సంవత్సరం జనరల్ విభాగంలో 1,645 మంది పరీక్షలకు హాజరు కాగా, 823 మంది ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ విభాగంలో 658 మందికి గాను 502 మంది పాసయ్యారు. కాకినాడ ఏఎస్‌డీ కళాశాలల సీనియర్ ఇంటర్ ఎంపీసీ విద్యార్థిని ఎండీ మెహబూబ్ ఉన్నీసా 974 మార్కులు, జూనియర్ ఎంపీసీలో శ్రీసాహితి 443 చొప్పున మార్కులు సాధించి ప్రతిభ చూపారు.



ఏఎస్‌డీ ప్రభుత్వ కళాశాల టాపర్ మెహబూబ్ ఉన్నీసాను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సీహెచ్ఎన్ మూర్తిరాజు

ఇంటర్ పరీక్షా ఫలితాలివీ...

కేటగిరీ	సంవత్సరం	పరీక్షకు హాజరైన వారు	ఉత్తీర్ణులు	ఉత్తీర్ణత శాతం
బాలురు	ప్రథమ (జనరల్)	8,803	4,800	55
	ఒకేషనల్	675	307	45
	ద్వితీయ (జనరల్)	6,715	4,476	67
	ఒకేషనల్	450	278	62
బాలికలు	ప్రథమ (జనరల్)	10,853	7,073	65
	ఒకేషనల్	956	636	67
	ద్వితీయ (జనరల్)	9,254	6,861	74
	ఒకేషనల్	671	544	81

ఇంజినీరింగ్ చదువుతా



ఎంసెట్‌లో మంచి ర్యాంక్ సాధించి, ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదవడమే నా లక్ష్యం. అధ్యాపకులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో మంచి మార్కులు సాధించగలిగాను. మా నాన్న ఖాదర్‌వలీ హోటల్ నిర్వహిస్తుండగా, అమ్మ బషీర్ గృహిణి.

– ఎండీ మెహబూబ్ ఉన్నీసా, ఏఎస్‌డీ కళాశాల, కాకినాడ

సార్వత్రిక పోరుకు సమగ్ర ప్రణాళిక

- పక్కాగా ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం కసరత్తు
- నిబంధనల అమలుకు పటిష్ట చర్యలు
- సీ–విజిల్, సువిధ యాప్‌ల ద్వారా ఫిర్యాదులు, అనుమతులు
- 159 మంది సెక్టోరల్ అధికారుల నియామకం
- సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి



కలెక్టరేట్ స్పందన హాలులో ఏర్పాటు చేసిన ఎన్నికల సెల్ విభాగాలను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నివాస్

కాకినాడ సిటీ: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు మరో నెల రోజులు మాత్రమే సమయం ఉంది. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియను శాంతియుత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం సమగ్ర ప్రణాళికతో పని చేస్తున్నారు. ఎన్నికల సంఘం నిబంధనలను, ఎప్పటికప్పుడు వస్తున్న ఆదేశాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్ పక్కాగా అమలు చేస్తున్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటున్నారు. ఎలాంటి పొరపాట్లు, అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రజాస్వామ్య స్ఫూర్తి ప్రస్ఫుటించేలా నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలని సూచిస్తున్నారు. ఎలాంటి అక్రమాలూ జరగకుండా నిఘా ఉంచారు.

పోలింగ్‌కు 12,600 మంది..

- గత నెల 16న సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు విడుదలైన సంగతి తెలిసిందే. ఎన్నికల నిర్వహణ పనుల్లో గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ ఉద్యోగులు, అధికారులు నిమగ్నమయ్యారు.
- జిల్లాలో ఎన్నికల విధుల్లో కీలకమైన సెక్టోరల్ ఆఫీసర్లుగా 159 మందిని నియమించారు. సరాసరి ప్రతి పది పోలింగ్ కేంద్రాలకు ఒకరు చొప్పున సెక్టోరల్ ఆఫీసర్లను విధుల్లో ఉంచారు. వారికి ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ అధికారాలు ఇచ్చేందుకు కలెక్టర్ నివాస్ చర్యలు తీసుకుంటున్నారు.
- వీరికి అదనంగా నియోజకవర్గానికి ఒక రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ) చొప్పున ఏడుగురిని నియమించారు. అలాగే, 46 మంది ఏఆర్ఓలు, 30 మంది జిల్లా స్థాయి నోడల్ అధికారులను కూడా నియమించారు.
- ప్రతి నియోజకవర్గానికి 3 నుంచి 4 చొప్పున 21 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 21 సర్వైలెన్స్ బృందాలు, 21 స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు, 8 అకౌంటింగ్ బృందాలు, 18 మంది అసిస్టెంట్ అబ్జర్వర్లతో పాటు మొత్తం 12,600 మందికి పైగా పోలింగ్ సిబ్బంది ఎన్నికల నిర్వహణలో పాలు పంచుకోనున్నారు. వీరితో పాటు 50 మంది జిల్లా అధికారులు, 21 మంది మండల స్థాయి అధికారులు కూడా ఈ ప్రక్రియలో పాల్గొంటారు.
- ఓటర్ల జాబితాకు సంబంధించి ఫారం–7, 8 దరఖాస్తులను నూరు శాతం పరిష్కరించారు. తద్వారా ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియ పూర్తి చేశారు. ఈ ఎన్నికలకు సంబంధించినంత వరకూ కొత్త ఓటర్ల నమోదుకు నామినేషన్ల ప్రక్రియ ముగిసే ఈ నెల 25 వరకూ అవకాశం ఇచ్చారు.
- కలెక్టరేట్ స్పందన హాలులో ఎన్నికల కంట్రోల్ రూము ఏర్పాటు చేశారు. దీనిలో పలు రకాల సేవలు, పరిశీలనలు చేస్తారు. సీ–విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదులు స్వీకరించి, 100 నిమిషాల్లోనే పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు. ఇప్పటి వరకూ సీ–విజిల్ ద్వారా 233 ఫిర్యాదులు రాగా, వాటిని పరిశీలించి, పరిష్కరించారు.
- సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించే ముందు సంబంధిత అధికారుల నుంచి రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలి. నిబంధనలన్నీ పరిశీలించి సువిధ యాప్ ద్వారా అనుమతులు ఇస్తున్నారు.
- ఈ సేవలతో పాటు 1950 టోల్ ఫ్రీ నంబర్, వ్యయ కమిటీలు, స్వీప్, మీడియా మానిటరింగ్, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసీసీ), సింగిల్ విండో అనుమతుల వంటి సేవలు కంట్రోల్ రూములో ఏర్పాటు చేశారు.

జిల్లాలో ఓటర్లు :	6,17,829
పురుషులు :	7,96,692
మహిళలు :	8,20,954
థర్డ్ జెండర్లు :	183
ఎన్నికల విధుల్లో సిబ్బంది :	12,600
పోలింగ్ కేంద్రాలు :	1,640
చెక్‌పోస్టులు :	29
సమస్యాత్మక గ్రామాలు :	160

29 చెక్‌పోస్టులు

ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు అక్రమంగా డబ్బు, మద్యం, ఇతర వస్తువులు రాకుండా నిరంతరం తనిఖీలు చేస్తున్నారు. జిల్లాలో మూడు అంతర్రాష్ట్ర, ఐదు అంతర్ జిల్లా సరిహద్దు, ప్రతి మండలంలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం 29 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. వీటి వద్ద మూడు షిఫ్టుల్లో ఐదుగురు చొప్పున పోలీసులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరు ప్రతి రోజూ ఒక్కో షిఫ్టులో 200 చొప్పున వాహనాలు తనిఖీ చేయాల్సి ఉంటుంది. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేలా అధిక మొత్తంలో డబ్బు, మద్యం, ఇతర వస్తువులు రవాణా చేస్తుంటే పట్టుకునేలా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకూ పెద్ద ఎత్తున నగదు, బంగారం, అక్రమ మద్యం, మాదక ద్రవ్యాలు స్వాధీనం చేసుకున్నారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో...

జిల్లావ్యాప్తంగా రౌడీ షీటర్లను ఇప్పటికే బైండోవర్ చేసుకున్నారు. గ్రామాల్లో ఎన్నికలకు సంబంధించి ఎంసీసీ గురించి అవగాహన కల్పిస్తున్నారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల్లో సాయుధ దళాలతో స్థానిక పోలీసులను కలుపుకొని కవాతు నిర్వహిస్తున్నారు. ఇతర జిల్లాల నుంచి ఎవరైనా కొత్త వ్యక్తులు, అనుమానాస్పదంగా ఉన్నవారు, రౌడీ షీటర్లు జిల్లాలోకి వస్తే ఆయా జిల్లాల పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుంటూ, వారిపై కూడా పూర్తి స్థాయిలో నిఘా ఉంచారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది ఎవరైనా నిర్లక్ష్యం వహించినా, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినా కఠిన చర్యలు తీసుకుంటాం. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని చర్యలూ తీసుకున్నాం. కమాండ్ కంట్రోల్ రూము ఏర్పాటు చేసి జిల్లావ్యాప్తంగా ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తున్నాం. కంట్రోల్ రూములో అవసరమైన అన్ని విభాగాలూ ఏర్పాటు చేశాం. సింగిల్ విండో, సువిధ ద్వారా రాజకీయ పార్టీలు, పోటీలో ఉండే అభ్యర్థులకు అవసరమైన అనుమతులు మంజూరు చేస్తున్నాం. జిల్లా పరిణామాలను ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషనర్‌కు నివేదిస్తున్నాం. శాంతిభద్రతలు, అక్రమ డబ్బు, మద్యం, ఇతర వస్తువుల రవాణా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం.

– జె.నివాస్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్, కాకినాడ

రాములోరి పెళ్లికి పందిరి రాట

- 16న వధూవరులుగా సీతారాముల అలంకరణ
- 17న సీతారామ కల్యాణం
- 24న శ్రీపుష్పయాగంతో వేడుకల ముగింపు


పందిరి రాట కార్యక్రమంలో పాల్గొన్న పండితులు, అధికారులు

అన్నవరం: రత్నగిరి క్షేత్ర పాలకుడు శ్రీ సీతారామచంద్రస్వామి వారి శ్రీరామ నవమి వేడుకలకు పండితులు శుక్రవారం పందిరి రాట వేశారు. రత్నగిరిపై రామాలయం వద్ద ఉదయం ఈ కార్యక్రమం జరిగింది. పండితులు తొలుత పందిరి రాటకు పసుపు రాసి, కుంకుమ బొట్లు పెట్టి, పూలతో అలంకరించి, పూజలు చేశారు. అనంతరం వేదమంత్రోచ్చారణతో రాట ముహూర్తం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఈఓ కృష్ణారావు, సత్యదేవుని ఆలయ ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యశర్మ, కల్యాణబ్రహ్మ చామర్తి కన్నబాబు, రామాలయ అర్చకులు దేవులపల్లి ప్రసాద్, పురోహితులు పాలంకి పట్టాభి తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 16 నుంచి 24 వరకూ తొమ్మిది రోజుల పాటు రత్నగిరిపై శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. రత్నగిరి క్షేత్ర పాలకులుగా పూజలందుకుంటున్న సీతారాముల కల్యాణ మహోత్సవాలను సాక్షాత్తూ సత్యదేవుడు, అమ్మవారు పెళ్లిపెద్దలుగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. 16వ తేదీ సాయంత్రం 4 గంటలకు సీతాదేవి, శ్రీరామచంద్రమూర్తిని వధూవరులుగా అలంకరించడంతో శ్రీరామ నవమి వేడుకలు ప్రారంభమవుతాయి. 17వ తేదీ శ్రీరామ నవమి సందర్భంగా ఉదయం 10 గంటల నుంచి సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహిస్తారు. 18, 19, 20, 21 తేదీల్లో సీతారాములకు ప్రత్యేక పూజలు, 22న వనవిహారోత్సవం, 23న శ్రీచక్రస్నానం, దండియాడింపు ఉత్సవాలు నిర్వహిస్తారు. 24వ తేదీ రాత్రి శ్రీపుష్పయాగంతో శ్రీరామ నవమి వేడుకలు ముగుస్తాయి.

16న భద్రాచలానికి ప్రత్యేక బస్సులు

కాకినాడ సిటీ: శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలంలో సీతారామచంద్రస్వామి దర్శనానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని ఏపీఎస్ ఆర్టీసీ కాకినాడ డిపో మేనేజర్ మనోహర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సులు 16వ తేదీ ఉదయం 6, 8, 10 గంటలకు కాకినాడలో బయలుదేరుతాయన్నారు. సీతారాముల కల్యాణ మహోత్సవం పూర్తయిన తరువాత ఈ బస్సులు భద్రాచలంలో 17వ తేదీ మధ్యాహ్నం నుంచి రాత్రి వరకూ తిరుగు పయనమవుతాయని తెలిపారు. ఈ బస్సులకు సాధారణ చార్జీ మాత్రమే వసూలు చేస్తారన్నారు. ప్రతి రోజూ కాకినాడ నుంచి తిరిగే ఏడు సర్వీసులకు అదనంగా ఈ బస్సులు నడుపుతున్నామని తెలిపారు. ఈ బస్సులకు రానుపోను రిజర్వేషన్ సౌకర్యం ఉందన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు వినియోగించుకోవాలని మనోహర్ కోరారు.

ఉమ్మడి జిల్లాలో సీఎం జగన్ ఎన్నికల శంఖారావం



- 16న రాజమహేంద్రవరం చేరనున్న బస్సు యాత్ర
- 18న రావులపాలెంలో 'మేమంతా సిద్ధం' సభ
- విజయవంతం చేయాలని నేతల పిలుపు

రాజమహేంద్రవరం సిటీ/సాక్షి, అమలాపురం/రావులపాలెం: సంక్షేమ రథ సారథి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. ఆయన రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర ఈ నెల 16 నుంచి జిల్లాలో జరగనుంది. దీనిని విజయవంతం చేసేందుకు నేతలు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వివరాలను వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్లు పి.మిథున్‌రెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌లు రావులపాలెం సీఆర్‌సీలో శుక్రవారం విలేకర్లకు వెల్లడించారు. సీఎం జగన్ పర్యటన వివరాలను మిథున్‌రెడ్డి వివరించారు. ఈ నెల 15వ తేదీన భీమవరంలో సిద్ధం సభ ముగించుకుని సీఎం జగన్ రాజమహేంద్రవరం రూరల్‌కు చేరుకుంటారన్నారు. 16వ తేదీన రాజమహేంద్రవరంలో రోడ్డు షో నిర్వహించి, అక్కడే బస చేస్తారని చెప్పారు. శ్రీరామ నవమి పండగ సందర్భంగా 17న ప్రచారానికి సెలవు ప్రకటించారని, తిరిగి 18వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు రావులపాలెంలో జరిగే 'మేమంతా సిద్ధం' సభలో పాల్గొంటారని వివరించారు. ఈ సభకు సుమారు 2 లక్షల మంది వస్తారనే అంచనాతో పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నాయని చెప్పారు. సీఎం జగన్ సభను విజయవంతం చేయాలని నాయకులు, కార్యకర్తలు, అభిమానులను కోరారు. సభ అనంతరం సీఎం జగన్ కాకినాడ వెళతారన్నారు. సిద్ధం సభా వేదికపై జిల్లాలోని ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రజలకు పరిచయం చేస్తారని మిథున్‌రెడ్డి, విశ్వరూప్ తెలిపారు. రాజ్యసభ సభ్యుడు బోస్ మాట్లాడుతూ, రానున్న ఎన్నికలు ప్రజల కోసం పని చేస్తున్న వైఎస్సార్ సీపీకి, స్వలాభం కోసం జత కట్టిన 3 పార్టీలకు మధ్య జరుగుతున్నాయన్నారు. 71 ఏళ్ల దేశ ఎన్నికల చరిత్రలో మేనిఫెస్టోను వంద శాతం అమలు చేసింది సీఎం జగన్ ఒక్కరేనన్నారు. ఇది పార్టీకి కలిసి వచ్చే అతి పెద్ద అంశమని, ప్రజలు దీనిని గుర్తించారని, ఎంతమంది జత కట్టినా వైఎస్సార్ సీపీపై గెలవడం సాధ్యం కాదని చెప్పారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కుమార్, అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు, ఎమ్మెల్యే అభ్యర్థులు చిర్ల జగ్గిరెడ్డి, తోట త్రిమూర్తులు, విప్పర్తి వేణుగోపాలరావు, గొల్లపల్లి సూర్యారావు, పిల్లి సూర్యప్రకాశరావు, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్ పాల్గొన్నారు. అంతకుముందు మిథున్‌రెడ్డి నియోజకవర్గాల వారీగా పార్టీ స్థితిగతులు, ఎన్నికల ప్రచారం తీరుతెన్నులు అడిగి తెలుసుకున్నారు.



రావులపాలెంలో మేమంతా సిద్ధం పోస్టర్ విడుదల చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు మిథున్‌రెడ్డి, బోస్, మంత్రి విశ్వరూప్ తదితరులు

రాజమహేంద్రవరంలో యాత్రను విజయవంతం చేయాలి

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 16న రాజమహేంద్రవరం నగరంలో నిర్వహించనున్న మేమంతా సిద్ధం బస్సు యాత్రను విజయవంతం చేయాలని స్థానిక ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ విజ్ఞప్తి చేశారు. సీఎం జగన్ బస్సు యాత్ర నేపథ్యంలో పార్టీ ఇన్చార్జులు, అబ్జర్వర్లతో తన కార్యాలయంలో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. సీఎం జగన్ బస్సు యాత్రను దిగ్విజయం చేయాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులందరిపై ఉందని అన్నారు. ఈ నెల 16వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు సీఎం జగన్ బస్సు యాత్ర నగరానికి చేరుతుందన్నారు. కాతేరు నుంచి గామన్ బ్రిడ్జి మీదుగా మల్లయ్యపేట, ఏపీ పేపర్ మిల్లు, సీతంపేట, కంబాల చెరువు, జాంపేట, ఆజాద్ చౌక్, చర్చిపేట, అప్సరా థియేటర్, సాయికృష్ణ థియేటర్ మీదుగా డీలక్స్ సెంటర్, కోటిపల్లి బస్టాండ్ వరకూ సాగుతుందని తెలిపారు. సీఎం జగన్‌కు పెద్ద ఎత్తున స్వాగతం పలికి, ఆయన రోడ్డు షో ముగిసే వరకూ పార్టీ శ్రేణులు, లబ్ధిదారులు, పార్టీ అభిమానులు, నగర ప్రజలు అన్ని డివిజన్ల నుంచి తరలివచ్చేలా ఆయా డివిజన్ల ఇన్చార్జులు కృషి చేయాలని ఎంపీ భరత్ రామ్ కోరారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ (రుడా) చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, పార్టీ పరిశీలకుడు రావిపాటి రామచంద్రరావు, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, నందెపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్. చిత్రంలో రౌతు సూర్యప్రకాశరావు తదితరులు

క్లుప్తంగా

చురుగ్గా సత్యదేవుని నమూనా ఆలయ పనులు

22న ప్రారంభం



నమూనా ఆలయం గుమ్మం ముహూర్తంలో పాల్గొన్న పండితులు, అధికారులు

అన్నవరం: స్థానిక జాతీయ రహదారిపై సుమారు రూ.నాలుగు కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న సత్యదేవుని నమూనా ఆలయం పనులు చురుకుగా జరుగుతున్నాయి. ఈ నెల 22వ తేదీన స్వామివారి నమూనా ఆలయంలో సత్యేదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి, శంకరుల విగ్రహాల ప్రతిష్ఠ, ఆలయ శిఖర ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించాలని ఇప్పటికే అధికారులు నిర్ణయించారు. దీంతో ఆలయ నిర్మాణ పనులు మరింత వేగంగా జరుగుతున్నాయి.

ఘనంగా గర్భాలయ గుమ్మం ముహూర్తం

దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ ఆదేశాల మేరకు శుక్రవారం నమూనాలయ గర్భాలయ గుమ్మం ముహూర్తం ఘనంగా నిర్వహించారు. ఉదయం పది గంటలకు పండితుల మంత్రోచ్చాటన మధ్య సత్యదేవుని ఆలయ ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, కల్యాణ బ్రహ్మ ఛామర్తి కన్నబాబు ప్రధాన ద్వారం గుమ్మానికి పూజలు చేశారు. అనంతరం ఆలయ ఈఈ నరసింహారెడ్డి, ఏఈఓ కృష్ణారావు, డీఈ గుర్రాజు, ఆలయ నిర్మాణ కాంట్రాక్టర్ డీవీ సుబ్బరాజు పూజలు చేశారు. వచ్చే పది రోజుల్లో ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.

ఓటరు జాబితాలో మీ పేరుందా?

- ఓటు లేకపోతే ఫారం–6 ద్వారా దరఖాస్తుకు అవకాశం
- ఓటును ఫోన్ నంబర్‌కు అనుసంధానం చేయొచ్చు



ప్రత్తిపాడు రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు అందరూ సిద్ధంగా ఉన్నారు. ఇలాంటి తరుణంలో అసలు ఓటరు జాబితాలో తన పేరు ఉందో? లేదో? అనే సందేహం కొందరిలో ఉంటుంది. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకున్న భారత ఎన్నికల కమిషన్ జాబితాలో ఓటు వివరాలు ముందే తెలుసుకునే అవకాశాన్ని కల్పించింది. జాబితాలో ఓటు లేదని గుర్తిస్తే వెంటనే ఫారం–6 ద్వారా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. కొత్తగా ఓటరు నమోదుకు ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ముగిసే ఏప్రిల్ 25వ తేదీ వరకు అవకాశం కల్పించారు. ప్రస్తుత ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేలా అనుబంధ జాబితాలో చేరుస్తారు.

అందుబాటులో ఓటర్ హెల్ప్ లైన్

ఓటరు జాబితాలను పోలింగ్ కేంద్రాల పరిధిలోని బూత్ లెవల్ అధికారి (బీఎల్ఓ), తహసీల్దారు కార్యాలయంలో ఇప్పటికే అధికారులు అందుబాటులో ఉంచారు. ఆయా అధికారిక కార్యాలయాలకు వెళ్లి జాబితాను పరిశీలించి, ఓటు హక్కు ఉందో... లేదో నిర్ధారించుకోవచ్చు. అలా కాకపోతే ఆన్‌లైన్‌లో చూసుకునే అవకాశాన్ని కూడా భారత ఎన్నికల సంఘం కల్పించింది. ఇందుకోసం ప్రత్యేకంగా ఓటర్ హెల్ప్ లైన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది.

స్మార్ట్ ఫోన్లలో ఓటర్ హెల్ప్ లైన్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవడం ద్వారా ఓటరు వివరాలు తెలుసుకోవచ్చు. ఈ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్ ఓపెన్ చేయగానే ఆప్షన్లు వస్తాయి. సెర్చ్ యువర్ నేమ్ ఇన్ ఎలక్టోరల్ రోల్ అని కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేస్తే సెర్చ్‌బై కింద వచ్చిన ఆప్షన్లలో ఎపిక్ నంబర్ ద్వారా ఓటు వివరాలు తెలుసుకోవచ్చు.

ఫోన్ నంబర్‌తో అనుసంధానం ఇలా...

ఓటును మీ మొబైల్ ఫోన్ నంబర్‌కు అనుసంధానం చేసుకోవడం ద్వారా చాలా ప్రయోజనాలు ఉంటాయి. ఎవరైనా మీ ఓటును సవరించాలనో, తొలగించాలనో చూస్తే వెంటనే అనుసంధానం చేసుకున్న నంబర్‌కు సంక్షిప్త సమాచారం అందుతుంది. ఈ సౌలభ్యం పొందేందుకు వెబ్‌లింక్‌ను ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. హెచ్‌టీటీపీ://సీఈసీఏపీఈఆర్ఎంఎస్.ఏపీ.జీవోవీ.ఎన్ లింకును తెరిచి, ఇందులో ఓటరు ఐడీ నంబర్ ఎంటర్ చేయాలి. దాని కిందనే ఫోన్ నంబర్ ఎంటర్ చేసి రిజిస్టర్ ఆప్షన్‌ను క్లిక్ చేయాలి. వెంటనే ఫోన్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. దానిని ఎంటర్ చేసిన తర్వాత ఓటర్ ఐడీకి ఫోన్ నంబర్ అనుసంధానమవుతుంది.

- కంప్యూటర్ ద్వారా ఓటర్ వివరాలు తెలుసుకునే హెచ్‌టీటీపీ://ఎలక్టోరల్‌సెర్చ్.ఈసీఐ.జీవోవీ.ఇన్ వెబ్ సైట్ ఓపెన్ చేయాలి. అందులో సెర్చ్‌బై ఎపిక్ నంబర్ అనే ఆప్షన్‌పై క్లిక్ చేసి, ఓటర్ ఐడీ నంబర్, స్టేట్ అనే చోట ఆంధ్రప్రదేశ్ అని సెలెక్ట్ చేసుకోవాలి. క్యాప్చర్ కోడ్ ఎంటర్ చేసి సెర్చ్ ఆప్షన్‌ను క్లిక్ చేయగానే ఓటు వివరాలు కనిపిస్తాయి.
- ఓటు వివరాలు తెలుసుకునేందుకు1950 టోల్ ఫ్రీ నంబర్‌ను సైతం ఎన్నికల కమిషన్
- అందుబాటులో ఉంచింది. ఈ నంబర్‌కు ఫోన్ చేసి ఓటర్ ఐడీ నంబర్ చెబితే అక్కడి సిబ్బంది ఆన్‌లైన్‌లో పరిశీలించి ఓటు ఉందా లేదా అనే విషయం చెబుతారు.

లేకపోతే నమోదు చేసుకోవాలి

ఓటు లేదని తెలిస్తే వెంటనే ఓటరుగా నమోదుకు ఫారం–6 ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. బీఎస్ఓ, తహసీల్దారు కార్యాలయంలో మాన్యువల్‌గా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లోనూ ఓటరుగా నమోదు చేసుకునే వెసులుబాటు ఉంది.

ఇద్దరి నుంచి రూ.12 లక్షల స్వాధీనం

ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు



సామర్లకోట మఠం సెంటర్‌లో తనిఖీలు నిర్వహించిన ఫ్లయింగ్ స్క్వాడ్

సామర్లకోట: స్థానిక మఠం సెంటర్‌లోని యూనియన్ బ్యాంకు వద్ద ఇద్దరు వ్యక్తుల నుంచి ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది రూ.12,32,511 స్వాధీనం చేసుకున్నారు. మఠం సెంటర్‌లో మోటారు సైకిళ్లపై వేరు వేరుగా వెళుతున్న ఇద్దరిని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి జె.రామారావు ఆధ్వర్యంలో అనుమానంతో తనిఖీ చేశారు. అచ్చంపేట గ్రామానికి చెందిన యళ్ల రమేష్ ఎటువంటి ఆధారాలు లేకుండా రూ.7,28,611 నగదు కలిగి ఉండటంతో ఆయన వద్ద నుంచి సీఐ డి.సురేష్ ఆధ్వర్యంలో నగదును స్వాధీనం చేసుకున్నారు. పీబీ దేవం గ్రామానికి చెందిన సందవోలు వీరవెంకట సత్యనారాయణమూర్తి నుంచి రూ.5,03,900 స్వాధీనం చేసుకున్నారు. యూనియన్ బ్యాంకు నుంచి నగదు విత్ డ్రా చేసి తీసుకొని వస్తున్న సమయంలో నగదును స్వాధీనం చేసుకున్నారని, దీనికి సంబంధించిన ఆధారాలు ఉన్నా పోలీసులు పట్టించుకోలేదని సత్యనారాయణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. ఆధారాలతో కాకినాడ కలెక్టరేట్‌కు వెళ్లి సొమ్ము తెచ్చుకోవాలని చెప్పడం వింతగా ఉందని అన్నారు. 80 సంవత్సరాల వయసులో ఎండలో ఎక్కడ తిరుగుతానని, ఆధారాలను పరిశీలించి సొమ్ము ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సీఐ తీరును ఆయన తప్పు పట్టారు. ఎటువంటి ఆధారాలు లేకుండా స్వాధీనం చేసుకున్న నగదును పెద్దాపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి స్వాధీనం చేస్తామని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి రామారావు తెలిపారు.

సత్యదేవుని ఉత్సవాలకు పంపాలో నీటి నిల్వలకు చర్యలు

కలెక్టర్‌కు దేవస్థానం ఈఓ రామచంద్రమోహన్ లేఖ

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఈ నెల 16 వ తేదీ నుంచి జరుగనున్న శ్రీరామనవమి వేడుకలకు, మే 18 వ తేదీ నుంచి జరుగనున్న సత్యదేవుని దివ్య కల్యాణ మహోత్సవాలకు విచ్చేసే లక్షలాది మంది భక్తులకు పంపా నదిలో తగినన్ని నీటి వనరులు ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నవరం దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ కాకినాడ జిల్లా కలెక్టర్ జె.నివాస్‌ను కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం కలెక్టర్‌కు లేఖ రాశారు. పంపానదిలో నీరు అడుగంటిన వైనంపై ×సాక్షి౯ దినపత్రికలో ఈ నెల పదో తేదీన ×ఎండిపోయ్యినది౯ శీర్షికన వార్త ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై స్పందించిన ఈఓ పంపా నదిలో తగినంత నీటి నిల్వలు ఉంచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరనున్నట్టు తెలిపారు. దాని ప్రకారం ఆయన శుక్రవారం రాసిన లేఖలో ఈ వేసవిలో సత్యదేవుని ఆలయానికి ప్రతి నిత్యం వేలాది మంది భక్తులు విచ్చేస్తారని తెలిపారు. దేవస్థానంలో నీటి సరఫరాకు పంపా నదిలో గల బోర్ల ద్వారా పంపింగ్ చేసే నీరే ఆధారమని తెలిపారు. ప్రస్తుతం పంపా నదిలో నీరు లేనందున భక్తులకు, దేవస్థానానికి ఇబ్బంది తప్పదని తెలిపారు. శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా ఈ నెల 23న పంపా నదిలో శ్రీచక్రస్నానం, సత్యదేవుని కల్యాణ మహోత్సవాలలో భాగంగా మే నెల 23వ తేదీన సత్యదేవుని శ్రీచక్రస్నానం కార్యక్రమాలకు పంపా స్నానఘట్టం వద్ద కనీసం నాలుగు అడుగుల మేర నీటి మట్టం ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అందువల్ల ఏలేరు రిజర్వాయర్ నుంచి రోజు 200 క్యూసెక్కుల నీరు పంపాకు తరలించేలా ఆదేశాలివ్వాలని ఈఓ కోరారు.

లారీని ఢీకొని మోటార్ సైకిలిస్ట్ మృతి



మధు మృతదేహం

పెరవలి: నిడదవోలు–నరసాపురం ఆర్అండ్‌బీ రహదారిలో కానూరు వద్ద గురువారం అర్ధరాత్రి 12 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పెరవలి ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెరవలి మండలం అన్నవరప్పాడు గ్రామానికి చెందిన వసంతాడ మధు (20), నిడదవోలు మండల కలవచర్లలో తన బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి మోటార్ సైకిల్‌పై తన బంధువుల అబ్బాయి ముప్పిడి నాగ చరణ్‌తో కలసి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. డ్రైవర్ నిర్లక్ష్యంగా లారీని నడపడటంతో పాటు వేగంగా వస్తుండగా సడన్ బ్రేక్ వేయటంతో వెనుక ఉన్న మోటార్ సైకిలిస్ట్ లారీ వెనుక ఢీకొట్టాడు. అతని తలకు బలమైన గాయం అవ్వటంతో మధు అక్కడికక్కడే మృతి చెందాడు. చరణ్ తీవ్ర గాయాల పాలవ్వటంతో హుటాహుటిన 108లో తణుకులో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యం అందిస్తున్నామని తెలిపారు. మధు తల్లితండ్రులు పరాయి దేశంలో ఉపాధి కోసం వెళ్లారని ఎస్సై తెలిపారు. ఈ ప్రమాదానికి కారణం లారీ డ్రైయివరేనని అతని నిర్లక్ష్యం వలనే ఈ ప్రమాదం జరిగిందన్నారు. మృత దేహానికి శుక్రవారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామని తెలిపారు. మృతిని బందువులు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపారు.

రంగంపేట భవిత కేంద్రానికి రాష్ట్రంలో ప్రథమ స్థానం



విద్యార్థులతో ముచ్చటిస్తున్న అసిస్టెంట్ ఐఈ కో–ఆర్డినేటర్ డాక్టర్ రాధిక

రంగంపేట: ప్రత్యేక అవసరాలు గల పిల్లలను తీర్చిదిద్దటంలో రంగంపేట భవిత కేంద్రం రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించిందని రాష్ట అసిస్టెంట్ ఐఈ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.రాధిక అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీఎల్ఎం కిట్లు, ట్యాబుల వినియోగంలో విద్యార్థులు, ఉపాధ్యాయుల కృషి అభినందనీయమన్నారు. విద్యార్థుల నమోదు, హాజరు నిలకడలో కృషి చేస్తున్న కేంద్ర నిర్వాహకులు, ఐఈఆర్టీలు ముద్రగడ ప్రసాద్, జి.అంజిల కృషిని ఆమె అభినందించారు. అనంతరం రికార్డులు, విద్యాబోధన తీరును ఆమె పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా సమగ్ర శిక్ష ఐఈ కో–ఆర్డినేటర్ ఎస్.కన్నబాబు, మండల విద్యాశాఖాధికారి పి.మధుసూదనరావు, సీఆర్ఎంటి ఎల్. శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

14న భగవద్గీత అష్టావధానం



మీడియాతో మాట్లాడుతున్న పీఠం ఈసీ మెంబర్ సత్యనారాయణ, సభ్యులు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం రాజమహేంద్రవరం శాఖ ఆధ్వర్యాన స్థానిక గౌతమ ఘాట్‌లోని శ్రీ విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠంలో ఏప్రిల్ 14వ తేదీ సాయంత్రం 4 గంటలకు భగవద్గీత అష్టావధానం నిర్వహిస్తామని రాజమహేంద్రవరం శాఖ ఈసీ మెంబర్ వనపర్తి సత్యనారాయణ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ పీఠం నవమ పీఠాధిపతులు సద్గురు డాక్టర్ ఉమర్ ఆలీషా స్వామి దివ్య ఆశీస్సులతో భగవద్గీత అష్టావధానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బల్లిపాడుకు చెందిన తిరుపతి రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయ విద్యార్థి, అవధాని యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు ఈ అష్టావధానం చేస్తారని తెలిపారు. వేదావధానం నుంచి కవితావధానం వచ్చిందని, ఎంతోమంది అవధానులు అష్టావధానాలు, శతావధానాలు, సహస్రావధానాలు చేశారని, ఇంకా చేస్తున్నారని ఆయన వివరించారు. అయితే భగద్గీతను అవధానంగా మలిచి ఉమామహేశ్వరరావు ఇప్పటివరకు 19వ అవధానాలు చేశారని, 20వ అష్టావధానం రాజమహేంద్రవరంలో చేస్తున్నారని ఆయన చెప్పారు. అవధాన ప్రాచార్య, పద్య కళాతపస్వి, ధూళిపాళ మహాదేవమణి సభా సంచాలకులుగా వ్యవహరిస్తారన్నారు. పీఠం శాఖ కార్యదర్శి డి.కృష్ణంరాజు మాట్లాడుతూ కవులకు, గౌతమఘాట్ ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులను ఈ సందర్భంగా సత్కరిస్తామని తెలిపారు. పీవీఎస్ కష్ణారావు మాట్లాడుతూ ఈ సాహితీ కార్యక్రమానికి సాహితీ ప్రియులు విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

ముమ్మిడివరం: మోటారు సైకిల్‌పై వెళుతున్న భార్యాభర్తలను ట్రాక్టర్ ఢీకొనడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. ఐ.పోలవరం మండలం టి.కొత్తపల్లికి చెందిన చిన్నం వీరబాబు, ఆయన భార్య సత్యదుర్గ మోటారు సైకిల్‌పై కాట్రేనికోన మండలం పల్లంకుర్రు వెళ్లి తిరిగి వస్తుండగా మహిపాల చెరువు సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. అమలాపురంలో ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు ముమ్మిడివరం ఎస్‌హెచ్ఓ జి.భైరవస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గురుకుల విద్యార్థిని ప్రతిభ



బైపీసీ విభాగంలో 971 మార్కులు సాధించిన బుంగా ఈప జాస్మిన్

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన ఇంటర్ ఫలితాలలో బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల సీనియర్ ఇంటర్ బైపీసీ విద్యార్థిని బుంగా ఈప జాస్మిన్ 971 మార్కులు సాధించింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులలో జాస్మిన్ ఒకరు. గురుకుల కళాశాలలో జాస్మిన్ ప్రథమస్థానం సాధించగా, ఎంపీసీ విభాగంలో ఐ.స్ఫూర్తి 944 మార్కులతో ద్వితీయ స్థానం, ఎన్.లక్ష్మీ 943మార్కులతో తృతీయస్థానం సాధించారు. సీనియర్ ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ విభాగంలో 75మంది పరీక్షకు హాజరుకాగా 74మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో తొమ్మిది మంది 900 మార్కులు పైన సాధించారని ప్రిన్సిపాల్ ఏ.వాణికుమారి తెలిపారు.

రూ.4.34 లక్షల స్వాధీనం

ప్రత్తిపాడు: ఎటువంటి ఆధారాలు లేకుండా నగదును తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతని నుంచి రూ. 4.34 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్టు ప్రత్తిపాడు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన కథనం మేరకు శంఖవరం మండలం కత్తిపూడిలో ఫ్లెయింగ్ స్క్వాడ్ సిబ్బంది తనిఖీలో భాగంగా బైక్‌పై నగదును తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. పెట్రోల్ బంక్ నుంచి నగదును బ్యాంకుకు తరలిస్తున్నట్టు సదరు వ్యక్తి చెబుతున్నప్పటికీ ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్న నగదును స్క్వాడ్ బృందం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించారు.

పెద్దిపాలెంలో భారీ అగ్ని ప్రమాదం

రూ.10 లక్షల ఆస్తి నష్టం



పెద్దిపాలెంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో దగ్ధమైన తాటాకిల్లు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పెద్దిపాలెం గ్రామంలో గురువారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం జరిగింది. గ్రామానికి చెందిన అచ్చిరాజు, పక్కుర్తి లోవరాజు, పక్కుర్తి మాణిక్యంలకు చెందిన తాటాకింట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాప్తి చెందాయి. ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో ఒక్కసారిగా మంటలు వ్యాప్తి చెందడంతో ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ ప్రమాదంలో 20 కాటాల ధాన్యం, బైక్, నాలుగు తులాల బంగారం, లక్ష రూపాయల నగదుతో సహా గృహోపకరణాలు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.10 లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రత్తిపాడు అగ్రిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో మూడు కుటుంబాల వారు నష్టపోయారు.

ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యధిక శాతం ఉత్తీర్ణత సాధించారని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి తెలిపారు. జూనియర్ ఎంపీసీ విభాగంలో జె.యోగిత, ఎన్.సవిత, బి.అంజలి, ఎం.వి.సుజిత, పి.అవిశ్‌సాయిశ్వి, ఎం.బిందుమాధురి, ఎంవీఎస్ అనిరుథ్ 470 మార్కులకు గాను 465 మార్కులు సాధించారన్నారు. మరో 20 మంది 464 మార్కులు సాధించి ప్రతిభ చూపారన్నారు. బైపీసీలో ఎస్.పి.బి. వెంకట లలిత 440కు 435 మార్కులు, 434 ఒకరు, 433 ముగ్గురు, 432 ముగ్గురు సాధించారన్నారు. ఎంఈసీ విభాగంలో జి.మహేశ్వరి, కె.అంజనాదేవి, వీవీఎల్ సంతోషి, 500 మార్కులకు 489 ముగ్గురు, 487 ముగ్గురు, 486 నలుగురు సాధించారన్నారు. సీనియర్ ఎంపీసీ విభాగంలో ఎం.గీత సౌమ్య 990 మార్కులు, సయ్యిద్ షెహనాజ్ 989 సాధించారన్నారు. 988 మార్కులు ఐదుగురు, 987 మార్కులు ఎనిమిది మంది సాధించారన్నారు. బైపీసీలో బి.సౌమ్య 986తో పాటు వరుసగా 984,983,982 మార్కులు అత్యధిక విద్యార్థులు సాధించారని చెప్పారు. ఎంఈసీ విభాగంలో కె.ఎస్.ఎస్.శేఖరసాత్విక 978 మార్కులు, జి.సరయు 972, మరో ఇద్దరు 971 మార్కులతో ప్రతిభ చూపారన్నారు. విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల కార్యదర్శి దీపక్‌రెడ్డి, వైస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, కో–ఆర్డినేటర్ లక్ష్మీకుమార్ డైరెక్టర్లు గంగిరెడ్డి, రాఘవరెడ్డి, ప్రిన్సిపాల్ మెయినాలు అభినందించారు.

ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ప్రతిభ



బి.నందిని 463 మార్కులు



కే.ఎస్.ఆర్.కే.సుష్మ, 987

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రగతి విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు మంచి మార్కులతో ప్రతిభ చూపారని విద్యాసంస్థల చైర్మన్ నూతలపాటి పూర్ణచంద్రరావు శుక్రవారం తెలిపారు. ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో సీహెచ్ఎస్ఎస్ సందీప్ 470 మార్కులకు గాను 464, ఎం.సూర్యవర్షిణి 463, బి.నందిని 463, టి.హారిణి 463 మార్కులు సాధించినట్టు చెప్పారు. 460లోపు మార్కులతో 18 మంది ప్రతిభ చూపారన్నారు. బైపీసీలో సీహెచ్ దివ్య శ్రావణి 434, ఎన్.రత్నసాయి 434తో పాటు 430లోపు ముగ్గురు, సీఈసీలో కె.ఎ.ఎస్.ప్రియ 480, పి.శ్యామల 480 మార్కులు సాధించారన్నారు. సీనియర్ ఎంపీసీలో సీహెచ్ఎస్ సంతోషివర్షిణి 988, పి.శ్రీవేణి, కే.ఎస్.ఆర్.కే.సుష్మ 987 మార్కులు సాధించారన్నారు. కాకినాడ, పెద్దాపురం, జగపతినగరం, రాజమహేంద్రవరం బ్రాంచ్‌లలో మంచి మార్కులు సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఏజీఎం అనిల్‌బాబు, అధ్యాపకులు అభినందించారు.

చెస్ టోర్నీ విజేత సాయి సంతోష్



ఓపెన్ చెస్ టోర్నీ విజేతలతో ముఖ్యఅతిథి చంద్ర తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చీడిగలోని ఎస్ఎస్ఏవీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నీ విజేతగా సాయి సంతోష్ నిలిచాడు. రన్నర్‌గా రాజ్‌గోపాల్ గెలుపొందాడు. శుక్రవారం జరిగిన బహుమతి ప్రదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ వ్యాపార వేత్త వైఎస్ చంద్ర మాట్లాడుతూ క్రీడాకారులకు క్రమశిక్షణ, నిరంతర శిక్షణ అవసరం అన్నారు. చెస్ క్రీడ మేధస్సుకు సంబంధించినదని, దీనిని ఆడడం వల్ల మెదడు చురుకుగా పనిచేస్తుందన్నారు. విజేతలకు రూ.6వేలు నగదు పురస్కారాలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకుడు దివ్యతేజ, నల్లప్రసాద్, నాగం శ్రీనివాసరావు, చెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శివరామకృష్ణ, కోశాధికారి ప్రవీణ్ పాల్గొన్నారు.

లాడ్జిలో యువకుడి మృతి



లాడ్జిలో మృతిచెందిన అనిల్‌కుమార్

రామచంద్రపురం: పట్టణంలోని ఒక లాడ్జిలో యువకుడు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందాడు. రామచంద్రపురం ఎస్సై కె. సురేష్‌బాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కరప మండలం వేళంగి గ్రామానికి చెందిన పెమ్మనబోయిన అనిల్ కుమార్(25) క్రికెట్ బెట్టింగ్‌లు చేస్తూ చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. లాడ్జిలో రూం తీసుకున్న అనిల్‌కుమార్ బెట్టింగ్‌ల మూలంగా అప్పుల ఒత్తిడి గురయ్యినట్టు తెలుస్తోందని ఎస్సై తెలిపారు. ఈ మేరకు లాడ్జిలో తాను తీసుకున్న రూంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఏరియా ఆసుపత్రికి తరలించారు.